# విరుగుడు

ప్రభాకర్ ఇంటరు చదువుతున్న రోజుల్లోనే తల్లి వరలక్ష్మి ఈ లోకాన్ని విడిచి భర్తని, కొడుకుని అయోమయావస్థలో పడేసింది.

గోవిందరావుకి పదవీ విరమణ చెయ్యడానికి యింకా రెండేళ్ళ వ్యవధి ఉన్నా, ఇంటి పరిస్థితుల దృష్ట్యా ఇంకా ఉద్యోగ నిర్వహణ సాధ్యం కాదేమోననిపించింది. తల్లిని పోగొట్టుకున్న ప్రభాకర్‌ని, బాధ్యతారహితంగా తనూ వదిలేసి తన ఉద్యోగం చూసుకుంటే, వాడి భవిష్యత్తు దెబ్బతింటుందని భావించి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశాడు. అలా రిటైరవ్వగా వచ్చిన డబ్బుతో ఓ చిన్న ఇల్లు కొన్నాడు. మిగిలిన కొద్దిపాటి పైకాన్ని బ్యాంకులో వేశాడు. కొడుకు ప్రభాకర్‌కి ఎటువంటి ఇబ్బందీ లేకుండా చదివించాడు. వాడి సుఖం కోసం కోరినవన్నీ సమకూర్చాడు. తండ్రి అప్యాయతకీ, లాలనకీ మరువలేని అనుభూతిని పొందిన ప్రభాకర్, అతణ్ణి దేవుడి తర్వాత దేవుడిగా భావించడంలో ఆశ్చర్యంలేదు.

అదృష్టం కలిసొచ్చి, ప్రభాకర్‌కి ప్రథమ ప్రయత్నంలోనే జయం వరించి ఉన్న ఊళ్లోనే ఉద్యోగం లభించింది. గోవిందరావు ఆనందానికి హద్దులేకపోయింది. కొడుకు సుఖమయ జీవితానికి ఇంకే విధమైన ఢోకా ఉండదనుకున్నాడు.

"నా మనసులో ఉన్న మాటే నువ్వూ చెప్పావురా అబ్బాయ్. నువ్వు గ్రీన్‌సిగ్నల్ యిచ్చావు కాబట్టి, నేను ఆ ప్రయత్నంలోనే వుంటాన్రా!" అన్నాడు.

✪ ✪ ✪

ప్రభాకర్ స్ఫురద్రూపి. ఒడ్డూ పొడుగుతో మంచి పర్సనాలిటీ ఉన్నవాడు. ఉద్యోగి. సొంత ఇల్లుంది. ఓ పెళ్లికొడుక్కి యింతకంటే కావాల్సిన అర్హతలేవిఁటి? ఎన్నో సంబంధాలొస్తున్నాయి. వారిలో బాగా డబ్బున్న వాళ్లూ వున్నారు. సామాన్యులూ వున్నారు. ప్రభాకర్‌కి తల్లి లేకపోవడమే ఒక ప్రత్యేకమైన విషయంగా తీసుకున్నారు కొందరు. అత్తలేని కోడలు ఉత్తమురాలుగా ప్రసిద్ధి చెందుతుంది కదా!

గోవిందరావు డబ్బుకోసం చూళ్లేదు. అందంగా ఉండి, సామాన్య కుటుంబంలోంచి వచ్చిన 'నీరజ'ని యింటి కోడలుగా చేసుకోవడానికి నిర్ణయించుకున్నాడు. కొడుకు అభిమతాన్ని అడిగాడు ప్రభాకర్‌కి నీరజ నచ్చింది. మిగతా విషయాలు తండ్రికే వదిలేశాడు.

✪ ✪ ✪

ప్రభాకర్, నీరజల వివాహం ఘనంగా జరిగింది. నీరజ కాపురానికొచ్చింది. ప్రభాకర్, నీరజల దాంపత్య జీవితం కొన్ని నెలలు సాఫీగానే సాగింది. క్రమంగా నీరజ ప్రవర్తనలో పరిణామం వస్తున్నట్లు గమనించాడు ప్రభాకర్. గోవిందరావుకి కూడా అటువంటి సందేహమే వచ్చింది. ఎదుటి వారిపై అజమాయిషీ చెలాయించాలన్న ఆమె మనస్తత్వాన్ని సూచాయగా గ్రహించాడు. కాని ఎవరూ బైటపళ్లేదు.

ఓ రోజు ప్రభాకర్ నీరజని హెచ్చరించాడు. ముందుగానే ముందరి కాళ్లకి బంధం వేస్తూ, "నీరజా, మా నాన్నగారంటే నాకు ఎంతో గౌరవం. మా అమ్మ పోయిందగ్గర్నించి, ఆయన తల్లీ తండ్రీ తానే అయి నన్ను కంటికి రెప్పలా పెంచుకు వచ్చారు. నేనెక్కడ యిబ్బందులకు గురవుతానో అని పదవీ విరమణకి రెండేళ్ల వ్యవధి ఉన్నా, నాకోసం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఇదంతా నీకెందుకు చెబుతున్నానంటే అటువంటి మా నాన్నగారికి నువ్వూ నాలానే గౌరవించాలి. ఆయన మనసుకి నొప్పి కలిగించేలా ఎప్పుడూ ప్రవర్తించకు. అదే నా కోరిక" అన్నాడు.

నీరజ మొహంలో రంగు మారింది. భర్త అభిప్రాయం ఆమెకి అవగతమయ్యింది. ఆమె మనసు చివుక్కుమంది. ఆమె కళ్ళలో పల్చటి ఎరుపుదనం చోటుచేసుకుంది.

"అంటే, ఏవిటండీ మీ ఉద్దేశం? నా మనస్తత్వం అటువంటిదనుకుంటున్నారా?" సూటిగా భర్త మొహంలోకి చూస్తూ అంది.

"అబ్బే! అదికాదు నీరజా.." అని ఏదో అనబోయాడు ప్రభాకర్.

నీరజ మొహం ఎర్రబారింది. ఆ క్షణంలో తల్లి మాటలు ఆమెకి గుర్తుకొచ్చినయ్. "అమ్మాయ్, ఏపాటి చిన్న అవకాశం వచ్చినా దాన్నివదులుకోకు. వేరే కాపురం పెట్టించేయ్. అప్పుడే నీకు స్వేచ్ఛ, సుఖం ఉంటాయి. మీ మావగారి అజమాయిషీ వుండదు' అని చెప్పడం ఆమె చెవుల్లో ఇప్పటికీ గింగుర్లు పెడుతున్నాయి. ఇప్పుడు యీ చిన్న అవకాశం వచ్చింది గనక, దాన్ని జారవిడుచుకోలేదు.

"చాల్లెండి. మీకు ఎప్పుడైతే ఇటువంటి అనుమానం వచ్చిందో, ఇంక మనం ఇక్కడ వుండకూడదండీ. మీ హెచ్చరిక దృష్ట్యా, భవిష్యత్తులో చిన్న చిన్న విషయాలకి మీరు నన్నే నిందించే అవకాశాలు లేకపోలేదు. అంచేత మనం వేరే కాపురం పెట్టడమే శ్రేయస్కరమండీ" అంది విసురుగానే.

ప్రభాకర్ నివ్వెరబోయాడు. భార్యకి అటువంటి అభిప్రాయం రావడం దురదృష్టమనుకున్నాడు. ఆమె మనసులో ఎప్పట్నుంచో యీ కోరిక దాగి ఉండొచ్చునని అనుకున్నాడు.

"నీరజా, యేవిఁటి నువ్వంటున్నది?" ఆశ్చర్యంగా ఆమెకేసి చూస్తూ అన్నాడు.

నీరజ తొణకలేదు.

"ఔనండీ! నాకింక ఇక్కడుండటం మనస్కరించడంలేదు. ఖర్మచాలక ఏ చిన్న దురుసు మాట నానోట వచ్చినా, మీ నాన్నగార్ని కించపర్చానన్న బాధ మీకు కలగొచ్చు. అటువంటి అవకాశాన్ని మీకెందుకివ్వాలి? ముందుగా జాగ్రత్తపడ్డం మంచిది కదా! అందుకే వేరే కాపురం పెడదామండీ. ఉభయతారకంగా వుంటుంది" అంది నీరజ. ఆమె దృఢసంకల్పం ఆమె మాటల్లో స్పష్టమవుతోంది.

"ఇదే నీ ఆఖరి నిర్ణయమా?" చిరుకోపంతో ప్రశ్నించాడు ప్రభాకర్.

"ఔనండి! ఇదే నా ధృఢ సంకల్పం, నాకు స్వేచ్ఛ కావాలి. మనం, చిలకా గోరింకల్లా హాయిగా మసలాలి. అదే నాలో మెదుల్తోన్న చిరకాల వాంఛ"

"మరి మా నాన్నగారు...?" ప్రభాకర్ ప్రశ్న.

"ఆయనకేమండీ? మీ అమ్మగారు పోయాక, మహారాజులా బతికారు. మిమ్మల్ని ఎంతో అనురాగంతో సాకి, అభివృద్ధిలోకి తీసుకొచ్చారు. ఒంటరి జీవితం ఆయనకి కొత్తేం కాదండీ !" తేలిగ్గా అంది నీరజ.

ప్రభాకర్‌కి ఒళ్ళు మండిపోయింది. నీరజ అభిలాష ఏవిఁటో అర్థమైపోయింది.

"ఛీ ఛీ నీలో మానవత్వం బొత్తిగా లేనట్టుంది నీరజా. అప్పట్లో మా నాన్నగారి జవసత్వాలు పుష్కలంగా ఉండేవి. శ్రమించారు. ఇప్పుడు మళ్ళీ ఆయన చేయి కాల్చుకోవడమా ? అది మనకి సిగ్గుచేటు. అత్త ఎట్లాగూ లేదు. ఉన్న మావగార్ని కష్టబెట్టడం ఎందుకన్న ఇంగితమైనా నీకు లేకపోవడం..." కాస్త కోపంగానే అన్నాడు ప్రభాకర్.

నీరజ ఊరుకుంటుందా? అబ్బే ! ఆమె మనస్తత్వమే వేరు

"ఇంగితం లేకపోవడం నాకు కాదండీ, మీకు ! మీ నాన్నగారికి పెన్షను వస్తోంది.

స్వయంగా వంట చేసుకోవడం ఇష్టం లేకపోతే హాయిగా హొటల్లో తింటారు. అనవసరంగా వాదించి, నన్ను రెచ్చగొట్టకండి" మొండిగా అంది.

భార్య మనస్తత్వం బాగా తెలిసినవాడు గనక. వాదన పెంచుకోదల్చలేదు ప్రభాకర్.

"నువ్విప్పుడు గర్భవతివి. ఈ తరుణంలో నీకీ ఆలోచనలన్నీ ఎందుకు చెప్పు?" మరోసారి

సౌమ్యంగా చెప్పి చూశాడు.

కాని, నీరజలో మార్పు రవ్వంతయినా రాలేదు. ఆమె మస్తిష్కంలో తిష్టవేసుకున్న 'వేరు కాపురం' ఆలోచనని తుడిచిపారేయలేకపోయింది.

"నాకు తెలుసునండీ, నేను చెడ్డ మనిషిని కాదని నాలో మీ ప్రతిరూపం పెరుగుతోందని తెలుసు. నిజానికి అందుకే నా ఈ ప్రయత్నం. మరో నెలపోయాక నేను పురుడుకి మా వాళ్ళింటికి వెళ్ళిపోతాను. నేను తిరిగొచ్చేసరికి మీరు మన కోసం ఇల్లు చూసి ఉంచండి. ఇల్లు బావుండాలి సుమండి. నేను తిరిగి రావడం నేరుగా కొత్త ఇంటికే వస్తాను" అంది నీరజ.

ప్రభాకర్ క్షణం మౌనం వహించాడు. భార్య పట్టు వదలదని అతనికి తెలుసు.

"మరో విషయం ఆలోచించావా?" అన్నాడు.

"ఏమిటండీ?"

"నాకు వస్తోన్న జీతం, మనకి సరిపోతుందంటావా?"

"సరిపోతుంది. ఎందుకు చాలదూ? అందులోనే సర్దుబాటు చేసుకుంటామండీ" అంది నీరజ విజయం సాధించిన సంబరంతో.

"అంత ఓర్పు వుందా నీకు? సరే... నీ ఇష్టం" అంటూనే పక్కకి తిరిగి పడుకున్నాడు ప్రభాకర్.

తృప్తిగా నవ్వుకుంది నీరజ.

✪ ✪ ✪

ప్రభాకర్, తండ్రితో యీ విషయమంతా విన్నవించాడు బాధపడుతూనే, తండ్రి ఆవేదన చెందుతాడని అతనికి తెలుసు. అయినా తప్పదు కదా !

గోవిందరావు మనసులోనే కుమిలిపోయాడు. చప్పున మాట్లాడలేకపోయాడు.

"నాన్నా! మీరేమీ బాధపడకండి. మీ కోడలి మనస్తత్వం మీకు తెలుసును కదా!" మెల్లగా అన్నాడు ప్రభాకర్.

గోవిందరావు, పేలవంగా నవ్వేడు. "మీరు వేరే వెళ్ళిపోతున్నందుకు కాదురా నా బాధ ! నా మనవడు వచ్చే సమయానికి మీరు నాకు దూరమౌతున్నారన్నదే నా ఆవేదనరా అబ్బాయ్. ఎంతో వినయంగా వుంటూ, మనలో ఒక మనిషిగా కలిసిపోతుందన్న ఆశతో నీరజని కోడలుగా తెచ్చుకున్నాను. ఆమెని గురించి అంచనా వెయ్యడంలో తప్పటడుగు వేశానేమోననిపిస్తోందిరా" బాధపడుతూ అన్నాడు ప్రభాకర్ మెల్లగా మందహాసం చేశాడు.

"మీరేవీఁ బాధపడకండి నాన్న ! నీరజ పథకానికి విరుగుడు మందునా దగ్గరుంది. అదేవిఁటో ఇప్పుడు చెప్పను" అన్నాడు.

"సరే! నీ ఇష్టంరా అబ్బాయ్. నువ్వు నాకు ద్రోహం చెయ్యవని, మనస్తాపం కలిగించవని నాకు తెలుసురా! అయితే మీ ఆవిడ సంతృప్తి కోసం ఇప్పుడే వేరే కాపురం పెట్టుకో ! నాకేం అభ్యంతరం లేదు" సలహా ఇచ్చాడు గోవిందరావు.

"అలాగే నాన్న" అనేశాడు.

ప్రభాకర్ జాప్యం చెయ్యకుండా మర్నాడే ఓ యిల్లు అద్దెకి తీసుకుని శుభముహూర్తం చూసుకొని వేరే కాపురం పెట్టేశాడు. నీరజ ఆనందానికి అవధుల్లేకపోయాయి. తాను అనుకున్నది సాధించి నందుకు లోలోపల ఎంతగానో మురిసిపోయింది. తన విజయాన్ని తెలుపుతూ తల్లికి ఉత్తరం రాసింది. మరికొద్ది రోజుల్లోనే పురుడు పోసుకుందుకు కన్నవారింటికి వెళ్ళిపోయింది.

✪ ✪ ✪

కాలచక్రం నిర్విరామంగా తిరుగుతోంది.

నీరజకి మగపిల్లవాడు పుట్టాడు. ప్రభాకర్ వెళ్ళి కొడుకుని చూసి వచ్చాడు. గోవిందరావు సంతోషం వర్ణనాతీతం అయితే ఆ సంతోషం ఎంతోసేపు ఉండలేదు. మనవడు తమ వూరు వచ్చేసినా, తనకి దూరంగా వుంటే తన ఆనందానికి అర్ధమేముంటుంది? మనవడ్ని ఎత్తుకుని లాలించి, ఆడించే అదృష్టం తనకి లేదని దిగాలు పడ్డాడు. కొడుక్కి తన ఆవేదన్ని తెలిపాడు. తండ్రి ఆవేదనని అవగాహన చేసుకున్నాడు ప్రభాకర్. ఓ నిట్టూర్పు విడిచాడు.

"కొద్ది నెలలు ఓపిక పట్టండి నాన్నా! అన్నీ సక్రమంగా సాగిపోతాయి" ధైర్యం చెప్పాడు ప్రభాకర్.

"అలాగేలేరా! నువ్వు చెబుతున్నావుగా, ఓపిక పడతాను" అని అంటూ వుంటే గోవిందరావు కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినై.

✪ ✪ ✪

చంటాడికి మూడో నెల నిండుతుందనగా, నీరజను, చంటాణ్ణి, తీసుకొచ్చింది నీరజ తల్లి తాయారు. కూతురి వేరు కాపురం చూసి సంబరపడిపోయింది. తాయారులాంటి ఆడవాళ్ళకి, యిదో జబ్బేమో! కాని తమ కొడుకు, కోడలు వేరే కాపురం పెడితే ఒప్పుకోరు. మళ్లీ, స్వపర భేదాలు యిక్కడే తెలిసి పోతున్నాయి. అదే విచిత్రమైన స్వభావం. ఈ విధంగా ఎన్నో నిండుకుటుంబాలు నీరుగారిపోతూ వుండటం, మనం చూస్తున్నాం.. వింటున్నాం కూడా ! వారం రోజులుండి తాయారు వెళ్ళిపోయింది.

✪ ✪ ✪

ఇప్పుడు నీరజకి తీరిక లేకుండా పోయింది. చంటివాణ్ణి సంభాళించుకోవడం, వంట వండు కోవడం, యింటి పనులు చక్కపెట్టుకోవడంతోనే రోజంతా గడిచిపోతోంది.

"పాలడబ్బా నిండుకుందండీ..." అంది ఓ రోజు నీరజ

"అప్పుడేనా?" ఆశ్చర్యపోయాడు ప్రభాకర్.

"ఆశ్చర్యపోతున్నారెందుకు? నేను తాగేస్తున్నాననుకుంటున్నారా? చంటాడు సీసాలకి సీసాలు అరగించేస్తున్నాడు"

"మరి, తల్లిపాలు తాగటం లేదా?"

"అది మన దురదృష్టమండీ, నా పాలు వాడికి చాలడంలేదు" చిన్నబుచ్చుకుంటూ చెప్పింది.

"ఇంటి అద్దెకే సగం జీతం పోతోంది నీరజా... మరి"

భర్త మాటకి అడ్డొచ్చింది నీరజ.

"ఏవిఁటీ? ఇంటి అద్దెకి సగం జీతమా?"

కళ్లింతలు చేసుకుంటూ అంది నీరజ

ఔను నీరజా, ఈ ఇంటికి అద్దె ఎంతో తెలుసా?"

"ఎంత?"

"ఎనిమిది వందలు..."

"ఎనిమింది వందలా?"

"ఔను నీరజా! అది కేవలం అద్దె మాత్రమే! కరెంటు బిల్లు వేరు. ఇంత ఇల్లు లేకపోతే మనం వుండలేం. నువ్వూ ఈసడించుకుంటావు"

"ఔననుకోండి. ఇల్లు బావుంది మరేం చేస్తాంలెండి"

"చాకిలికి పని మనిషికి నెల సామాను... ఇవిగాక చంటాడికి పాలడబ్బాలకి మిగిలిన జీతం చాలడంలేదు. అంచేత పనిమనిషిని మాన్పించేద్దాం నీరజా" అన్నాడు సౌమ్యంగా తన ఆర్థిక స్థితి వ్యక్తం చేస్తూ.

నిర్ఘాంతపోయింది నీరజ

"ఏవిఁటి? పనిమనిషిని మాన్పించేస్తారా?" అంది

"మరేం చెయ్యను? వంద మిగుల్తుంది కదా?"

"నేను చెయ్యలేను బాబూ !"

"సర్దుకుపోదామన్నావు కదా?"

"అన్నాననుకోండి. కాని, చంటాడితో ఎలా సర్దుకుపోగలనండీ? వాణ్ణి ఎత్తుకుని ఆడించే వాళ్ళెవరైనా వున్నా బావుండేది కధా ?"

"ఎవరొస్తారు నీరజా? మనం కావాలని దూరం చేసుకున్నవాళ్లని, మళ్ళీ యిప్పుడు రమ్మంటే సబబుగా వుంటుందా? సరేలే... అవన్నీ ఇప్పుడెందుకులేగాని, అలా వెళ్ళి పాలడబ్బా తీసుకొస్తా నుండు" అంటూ బైటికి నిష్క్రమించాడు ప్రభాకర్.

✪ ✪ ✪

రోజులు గడుస్తున్నాయి చాలా భారంగానే, నీరజ ఆశించిన ఆనందం, స్వేచ్ఛ ఆమెకి కనుచూపు మేరలో అగుపించలేదు. భర్త ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల్ని గమనిస్తూనే వుంది. పోనీ తల్లికి ఉత్తరం రాసి డబ్బు తెప్పించుకోవాలీ అంటే అక్కడ వాళ్ళ పరిస్థితీ అంతంత మాత్రమేనని నీరజకి తెలుసు. 'వేరు కాపురం' సలహా అయితే ఇచ్చిందిగానీ దాని పరిణామాలు యిలా వుంటాయని తల్లి చెప్పకపోవడం, యిప్పుడు బాధ కలిగించింది నీరజకి.

" ఏవండీ..." అంది మెల్లగా ఓ రోజు నీరజ.

" ఏవిఁటి నీరజా..." ఆమెకేసి చూస్తూ ప్రశ్నించాడు.

"కోపగించుకోరు కదా?"

"లేదు... చెప్పు"

"సర్ఫ్ అయిపోయిందండీ..." భయపడుతూనే అంది. నెలాఖరురోజులు. భర్త కసురుకుంటాడని ఆమె భయం.

"అప్పుడేనా? ఇప్పుడే ఇలా అంటే చాకలిని మాన్పించేయాల్సి వస్తే ఇంకెంత సర్ఫు పడుతుందో?" వింతగా భర్తకేసి చూసింది నీరజ.

"ఏవిఁటీ? చాకలిని కూడా మాన్పించేస్తారా ఏవిఁటండీ?" అంది సుమారు ఆమె స్వరం బొంగు రుపోయింది.

ప్రభాకర్‌కి, భార్యపట్ల కాస్తంత జాలి కలిగింది. అయితే ఈ అనుభూతి బైటకి పొక్కనీయలేదు.

"ప్రస్తుతానికి కాదనుకో. జీతం చాలనప్పుడు ఎలాగో అడ్జస్టవ్వాలి కదా. ఎంత మంది ఇంట్లో

బట్టలు ఉతుక్కోవడం లేదు?" అన్నాడు.

నీరజకి ఏడుపొచ్చినంత పనయ్యింది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగి బొట్లు బొట్లుగా చెక్కిళ్ళపైకి జాలువారుతున్నాయి. ఏ స్వేచ్ఛని, ఆనందాన్ని ఆశించి "వేరే కాపురం" పెట్టించిందో, ఏదీ ఆ ఆనందం, స్వేచ్ఛ?... అనుకుంది మనసులో. ఆమెలో పశ్చాత్తాపం పెల్లుబికింది. తాను వెర్రి మొర్రి ఆలోచనలు పెంచుకుని తల్లి మాటలు విని వేరే కాపురం పెట్టించి సుఖాన వున్న జీవితాన్ని దుః ఖానికి చేరువగా తీసుకెళ్ళింది. భర్త ఎంత చెప్పినా, తాను వినిపించుకోలేదు. ఈ విధంగా ఎన్నాళ్ళు బతుకునీడ్చగలదు? మనసున్న మనిషి, ఉత్తముడూ అయిన మామగార్ని దూరం చేసుకుని, సొంత ఇంటి నుంచి బైటపడి, ఏం సాధించగలిగింది ! అసౌకర్యాన్ని, ఆవేదనని... ఆలూమగల మధ్య విభేదాల్ని తప్పించి ! చీర చెంగుతో కళ్ళొత్తుకుంది.

ఆ దృశ్యం ప్రభాకర్ హృదయాన్ని కదిలించింది.

"ఆ కన్నీళ్ళేవిఁటి నీరజా" అన్నాడు ఆరాటంగా.

దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది నీరజ బావురుమంది.

"ఏవండీ... ఏవండీ..." చెప్పలేకపోయింది. ఆమె గొంతు బొంగురుపోయింది.

"ఏమయ్యింది నీరజా ! చెప్పు" భార్య భుజమ్మీద చెయ్యివేసి అన్నాడు ప్రభాకర్.

"నన్ను క్షమించండీ..." అంటూనే భర్త భుజంపై వాలిపోయింది.

"దేనికి?"

"వేరే కాపురం పెట్టమని మిమ్మల్ని బలవంతపర్చినందుకు, ముందుచూపు లేకండా పరిస్థితుల్ని అర్థం చేసుకోండా... మా అమ్మ చెప్పిన మాటలు విని, యీ వెధవ పనికి పూనుకున్నానండీ! మిమ్మ ల్ని దేవుడులాంటి మావఁగార్ని అశాంతికి గురిచేశానండీ... ఇప్పుడు బుద్ధొచ్చింది. మనింటికి పోదా మండీ! మీ నాన్నగారితో పాటే వుందాం" చెప్పుకుపోయింది నీరజ.

ప్రభాకర్ ఆనందానికి హద్దుల్లేవు. సన్నగా మందహాసం చేస్తూ భార్యని దగ్గరగా తీసుకుని ఆమె కన్నీటిని తుడిచాడు.

"నీ తప్పు నువ్వు తెలుసుకున్నావు. అదే 'క్షమాపణ' అనుకో నీరజా ! ఒకరు చెప్పింది చెయ్యడం కాదు. మనం జీవితంలో స్వతంత్ర్యంగా ఆలోచించడం నేర్చుకోవాలి. అడుగు ముందుకు వేసే ముందు మంచీ చెడుల్ని బేరీజు వేసుకుని ముందు వెయ్యాలి. మరేం బాధపడకు. రేపే మనింటికి వెళ్ళిపోదాం" నవ్వుతూ భార్య మొహంలోకి చూశాడు.

"మీ నాన్నగారు మనల్ని క్షమిస్తారా?" సందేహంగా ప్రశ్నించింది.

ప్రభాకర్ గలగలా నవ్వేడు.

" పిచ్చిదానా ! మనవడ్ని ఆహ్వానించడానికి వేయికళ్ళతో ఎదురుచూస్తున్నాడు మా నాన్న. ఆయన మనసు వెన్నపూస లాంటిది నీరజా. సామాను సర్దు... రేపు వెళ్ళిపోదాం మా నాన్నకి ఈ శుభవార్త చెప్పి వస్తానుండు" బైటకి నిష్క్రమించాడు ప్రభాకర్.

నీరజ మనసు కుదుటపడిందిప్పుడు. లోలోపల నిండుగా నవ్వుకొని సామాన్లు సర్దటం ప్రారంభించింది.

✪✪✪

మర్నాడు ఉదయం గోవిందరావు ఇంటి ముందు నిల్చున్నాడు ఆసక్తితో ఎదురుచూస్తూ కొడుకూ, కోడలు, మనవడి కోసం. అప్పుడే ఆటో వచ్చి ఆగింది.

మనవణ్ణి కోడలి చేతుల్లోంచి తీసుకుని కడుపుతీరా ముద్దుల వర్షం కురిపించాడు గోవిందరావు.

ప్రభాకర్, నీరజ ముసిముసిగా నవ్వుకున్నారు.

"లోపలికి పదండర్రా.." అంటూనే మనవణ్ణి లోపలికి తీసుకుపోయాడు గోవిందరావు.

నీరజ, ప్రభాకర్ ముందుకి సాగారు.

□□□

(ఈనాడు ఆదివారం- 10.9.1995)